పోతుందని స్థిరపరుచుకున్నాను.

అప్పటినుంచి వసంత నా కలల ప్రతినిధిగా మారిపోయింది. ఆమెకు ముందే చెప్పాను. సాయంత్రాలు ఫోన్ చేస్తే అమ్మా నాన్నలకు డౌట్స్ క్లారిఫికేషన్ కోసమేనని చెప్పాలని. జీవితంలో అనేక అవాంతరాలను దాటుకొని, గొప్పగొప్ప విజయాలు సాధించిన వారి గురించి స్ఫూర్తిదాయకంగా వివరిస్తూ ఆమెకు ఒక జీవిత లక్ష్యాన్ని నిర్దేశించసాగాను.

ఉపాధ్యాయ వృత్తిలో నేను సాధించిన విజయాలు, పురస్కారాలన్నీ ఒక ఎత్తయితే, ఈ ఒక్క విజయాన్ని పొందితే నా అంతిమ విజయంగా ఆనంద పడతాను. గతంలో కూడా జోగినిగా మారిన విద్యార్థిని ఒకామెను తిరిగి వివాహం చేసుకొనేలా ప్రోత్సహించి విజయం సాధించాను. మధ్యలోనే చదువు మానేసిన వారిని ఓపెన్ యూనివర్సిటీ ద్వారా డిగ్రీ పూర్తి చేయించగలిగాను. కొందరు ఉద్యోగాలు కూడా సాధించారు.

చదువుతోపాటు, విద్యార్థుల వ్యక్తిగత జీవితాలనూ అధ్యయనం చేయడం నాకు గురుపరంపరగా అబ్బిందే. పదవ తరగతి వరకు సాంఘిక శాస్త్రం బోధించిన హన్మాండ్లు సార్ నాకు మార్గదర్శి. సమాజంలో నెలకొన్న కులమత భేదాలు, ఆర్థిక అంతరాలు, లింగ వివక్ష, అనేక రూపాల్లో కొనసాగే హింసను కళ్లకు కట్టినట్లు వివరించి, వాటి ప్రభావాలు విద్యార్థుల చదువుపై, ఎదుగుదలపై ఎలాంటి ప్రభావాల్ని చూపుతాయో చెప్పేవాడు. వాటిని అధిగమించాలంటే, చదువు ఒక్కటే ఆయుధమని బోధపరిచారు.

విద్యా సంవత్సరం ముగింపు దశకు వచ్చింది. విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేస్తుంటే, వారం నుంచి వసంత బడికి రాకపోవడం గమనించి పిల్లలను అడిగాను.

''ఆమెకు పెళ్లి సెటిల్ అయ్యింది సార్'' అని పిల్లలు అనగానే.. నా పక్కనే ఏదో బాంబ్ పేలినట్లు అదిరిపోయాను. షాక్‌కు గురయ్యాను. నా చెవులను నేనే నమ్మలేకపోయాను. నా తల బద్దలవుతున్న భావన.

''మేడం'' అంటూ గట్టిగా అరవగానే రమ్య మేడం పరుగున వచ్చారు. నాకు తెలియకుండానే, నా కళ్లలోంచి కారిపోతున్న కన్నీళ్లను తుడుచుకుంటూ..

''ఇలా జరిగిందేంటి మేడం? వసంతకు పెళ్లి అంటున్నారు. ఎంత ఘోరం ఇది. ఏది జరుగకూడదని భయపడ్డానో, అదే జరుగుతున్నది. ఎలాగైనా ఈ పెళ్లిని జరుగనివ్వను. అధికారులకు కంప్లయింట్ చేస్తాను''.

''సర్! మీరు అనవసరంగా ఆందోళన పడుతున్నారు. మీరేదో చేయాలన్న మితిమీరిన ఎక్స్‌పెక్టేషన్స్‌తో ఉండటం వల్ల అతిగా డిస్టర్బ్ అవుతున్నారు. నిజానికి ఇవన్నీ ఇక్కడ వెరీ కామన్. అనవసరంగా ఇందులో తల దూర్చకండి. గతంలో పోలీసులు, అధికారులు ప్రయత్నించినా ఈ తతంగం ఆగలేదు. ఒక ఉపాధ్యాయుడిగా మీరేం చేయలేరు. అది మీకు కూడా మంచిది కాదు. వాళ్లు అందరి లాంటివాళ్లు కాదు. నా మాట విని ఈ విషయాన్ని ఇంతటితో వదిలేయండి''.

ఇక ఆమెతో వాదించలేదు. వసంతకు ఫోన్ చేస్తే ఎత్తలేదు. ఆ రాత్రంతా నాకు నిద్రే పట్టలేదు. తెల్లవార్లూ వసంత గురించే ఆలోచించసాగాను. పద్నాలుగేండ్ల పసికూన. ఇంత చిన్నవయసులో చదువుకు దూరమై జీవితమంతా ఆ చక్రబంధంలో చిక్కి చితికిపోవాల్సిందే. వీళ్లలో ఇలా ఎంతమంది బలి అవుతున్నారో.

పెళ్లిరోజు నాడు ఉండబట్టలేక ఒక్కసారి వెళ్లి వస్తానంటే.. రమ్య మేడం తీవ్రంగా అభ్యంతర పెట్టారు. వాళ్లు నిర్దయగా ఉంటారని చెప్పి నన్ను నిరోధించారు.

నెల రోజులు నేను మనిషిని కాలేకపోయాను. బడిలో ఉన్నా, ఇంట్లో ఉన్నా ఆ పసి ముఖమే కళ్లలో కదలాడింది. ఎంత ఆశపడ్డాను. ఎన్ని ఆశలు కల్పించాను ఆమెకు. ఎంత మథనపడిందో.. ఎంత పెనుగులాడిందో. తరతరాలుగా పేరుకుపోయిన మూఢాచారాల ముందు, పెళ్లిలో పోచమ్మకు బలిచ్చే మేకపిల్లలాంటిదే.. వాళ్ల కులంలోని ఆడపిల్ల పరిస్థితి అనుకున్నాను.

కోర్టుకేసుతో నిలిచిపోయిన పదోన్నతుల ప్రక్రియ తిరిగి చేపట్టడం వల్ల గెజిటెడ్ హెడ్‌మాస్టర్ ప్రమోషన్‌తో నేను వేరే ఊరికి వెళ్లిపోయాను. ఆ ఊరిని విడిచి వెళ్తుంటే.. నా సొంత కూతురిని పులిబోనులోకి తోసి వెళ్తున్న బాధ ఏదో నన్ను మెలిపెట్ట సాగింది. నా అశక్తత నన్ను వెక్కిరించసాగింది.

* * *

కాలం గిర్రున తిరిగిపోయింది. నేను పదవీ విరమణ పొందాను. విశ్రాంత జీవితం గడుపుతున్న సందర్భంలో క్రమక్రమంగా వసంతను మర్చిపోయినా, జ్ఞాపకం వచ్చిన ప్రతీసారీ.. నా మనసు సునామీతో అల్లాడిన సాగరమవుతుంది. చదివే కథల్లో, చూసే సీరియళ్లలో ఎక్కడ వసంత, వసంతం పదాలు కనిపించినా, వినిపించినా.. తెలియకుండానే నా కళ్లు తడితడిగా మారేవి. గుండె బరువెక్కేది.

నేను రిటైర్ అయిన చాలా సంవత్సరాలకు ఒకనాడు ఉదయం ఓ వాహనం నా ఇంటి ముందు ఆగింది. అటెండర్‌లాంటి వ్యక్తి ముందు దిగి కారు డోర్ తెరవగానే.. అందులోంచి ఒక యువతి దర్పంగా దిగి నా వద్దకు రాసాగింది. నేను అయోమయంలో ఆమెను చూడసాగాను. వచ్చీ రాగానే, నన్ను, నా భార్యను కూర్చోబెట్టి పట్టు శాలువాలు కప్పి, కొత్త బట్టల కవర్లు మా చేతుల్లో పెట్టి స్వీట్లు, పండ్లు ఇచ్చి.. మా ఇరువురి కాళ్లకు దండం పెట్టింది. ఆమె ఎవరో ఎంతమాత్రం పోల్చుకోలేకపోతున్నా.

''సార్! నేను వసంతను. కొండాపూర్‌లో మీవద్ద ఏడో తరగతి వరకు చదువుకున్నాను. గుర్తుకొచ్చానా!?''

'వసంత' పేరు వినగానే నా ఒళ్లంతా ఒక్కసారిగా కంపించింది. సజల నేత్రాలతో ఆమెను ఆత్మీయంగా ఆలింగనం చేసుకొని..

''అమ్మా.. వసంతా! నువ్వా బేటా.. నా వసంత వా! నాకోసం వచ్చావా! ఎలా ఉన్నావు తల్లీ.. ఏం చేస్తున్నావు!?''.. వివశుడనై అడుగుతుండగానే,

''మీ వసంత ఇప్పుడు మీ జిల్లా డిప్యూటీ కలెక్టర్. మీరు వెలిగించిన దీపం. కాలం వీచిన కల్లోల గాలులకు ఆరిపోయినా.. మీ ఆశీస్సుల చమురుతో, మీరందించిన జ్ఞాన కాంతితో తనకు తాను వెలిగించుకొని ఇప్పుడు మీ ఆశీర్వాదం కోసం మీ ముందు నిలబడింది. మీరు కోరుకున్నట్లుగా మా సమూహంలోనే కాదు, సమాజంలోని ఏ ఆడపిల్లా బాల్య వివాహపు బాకుకు బలి కాకుండా రక్షణగా నేను నిలుస్తాను. అప్పుడు ఒక సాధారణ ఉపాధ్యాయులుగా మీకు అసాధ్యమైంది. ఇప్పుడు అధికారిగా, మీ ఆశయంలోంచి ఉద్భవించిన ఆయుధాన్ని నేను. మీ కలను నేను నిజం చేస్తాను సార్!''

''ఇది కలా.. నిజమా!? ఇంతటి అద్భుతం ఎలా సాధ్యమైందమ్మా!?''.

''సార్.. మాటలతోనే సరిపుచ్చుతారా. ఈ పూట భోజనం మీతో చేయాలనుకుంటున్నా''.

''శారదా! వెళ్లమ్మా.. అందరికీ భోజనాలు సిద్ధం చేయ్. ఈసారి కొత్తగా వసంతం మన గడప తొక్కింది. మన ఇల్లే కాదు, ఆమె పారాడిన నేలంతా పచ్చదనంతో పరవశిస్తుంది''.

భోజనాలు చేస్తున్నప్పుడు తన గతాన్ని చెబుతూ..

''ఆనాడు మూర్ఖత్వం ముందు మీ విజ్ఞత వెలవెలబోయింది. మూఢాచారం ముందు నా నిరసన.. స్వరం లేనిదయ్యింది. ఒక్కడే కొడుకు. పదెకరాల భూమి, పెద్ద బిల్డింగ్ ఇవన్నీ నన్ను సుఖపెట్టేవని తొందరపడ్డాడు నాన్న. చదువుకొంటానంటే.. 'మన కులంలో ఏ ఆడదైనా ఉద్యోగం జేసిందా.. ఊర్లేలిందా!?..' అంటూ బలవంతంగా పెళ్లి జరిపించాడు. ఇద్దరు పిల్లలై, వాళ్లు బడికి పోతున్నప్పుడు, నాలో నివురు గప్పి ఉన్న ఆశయం నిప్పయి రగిలింది. మీరు నాకోసం పడ్డ ఆరాటం, నన్ను నిలబెట్టాలని చేసిన నిశ్శబ్ద పోరాటం నన్ను నిలువనీయలేదు. పెళ్లయినప్పుడు ఆపేసిన చదువు, తిరిగి ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ పొందడంతో నన్ను నేను నిరూపించుకున్నాను. సోషల్ మీడియాలో ఎందరివో విజయగాథలు చూశాను. పెళ్లయి, పిల్లలైన తరువాత ఐఏఎస్, ఐపీఎస్‌లకు సెలెక్ట్ అయిన వాళ్ల స్టోరీలు ఒక ఎత్తయితే.. మీ ఆశయాన్ని నిలబెట్టాలన్న సంకల్పం మరొక ఎత్తయి గ్రూప్-1 పరీక్షలో స్టేట్ టాపర్‌గా నిలిచి డిప్యూటీ కలెక్టర్ పోస్ట్ సంపాదించాను. నా తరువాత లక్ష్యం సివిల్స్ రాసి కలెక్టర్ కావడమే. నా ప్రతి ఆలోచనకు మీ ప్రేరణ చోదకశక్తి. తిరిగి వెలిగిన ఈ దీపం వేల దీపాలను వెలిగిస్తూనే ఉంటుంది''.. తన విజయగాథను ముగించింది వసంత.

కానీ, ఆ తీరం చేరుకోవడానికి ఎన్ని తుఫానులను ఎదిరించిందో, ఎన్ని కల్లోలాలకు సవాలు విసిరిందో, కాలానికి ఎంత ఎదురీదిందో.. మొత్తానికి తాను గెలిచి, నన్ను గెలిపించిన వసంత నా ఆశయాన్నీ గెలిపిస్తుందన్న ప్రగాఢ విశ్వాసంతో, ఆశీస్సులందించి విజయగర్వంతో ఆమెను సాగనంపాను. నడిచి వెళ్తున్న వసంత చుట్టూ ఓ కాంతివలయం ప్రసరిస్తున్న భావన నాలో కలిగింది. ■

## గాజోజు నాగభూషణం



జీవితాన్ని ఉన్నతీకరించడంలో సాహిత్యానిది కీలక భూమిక అంటారు రచయిత గాజోజు నాగభూషణం. కవి, రచయిత, గాయకులుగా తెలంగాణ సమాజానికి సుపరిచితులు. ఈయన స్వస్థలం జగిత్యాల. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం కరీంనగర్‌లో నివాసం ఉంటున్నారు. అలిశెట్టి ప్రభాకర్ సాన్నిహిత్యంతో, జగిత్యాల రైతాంగ ఉద్యమాల ప్రభావంతో కవిత్వం రాయడం మొదలుపెట్టారు. నిరంతర ఉద్యమాల భాగస్వామ్యంతో ఎరుకలోకి వచ్చిన మానవ జీవన విధ్వంసమంతా.. కథల్లోనే ప్రతిఫలించే అవకాశముందని కథా రచనపై ఆసక్తి పెంచుకున్నారు. కవిత్వంలో 'మట్టి సరిగమలు', 'ప్రాణదీపం' సంకలనాలు వెలువరించారు. 'నెత్తుటి గాయాలు' పేరుతో తెలంగాణ ఉద్యమ గేయాలు రచించి, గానం చేసిన సీడీని విడుదల చేశారు. ఇప్పటివరకు 25 కథలు రాశారు. వీటిలో పదకొండు కథలకు వివిధ పోటీల్లో బహుమతులు అందుకున్నారు. నమస్తే తెలంగాణ - ముల్కనూరు సాహితీపీఠం కథల పోటీల్లో వరుసగా నాలుగేళ్లుగా బహుమతులు దక్కించుకుంటున్నారు.